క్లుప్తంగా

ఘనంగా లక్షపత్రి పూజ



లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం రెడ్డిపల్లి గ్రామంలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో కార్తికమాసం సందర్భంగా గణపతి హోమం, లక్షపత్రి పూజ, ఏకాహం కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆలయ సన్నిధిలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు రేలంగి ముకుందరావు, దాసరి శర్మ, కరాటం ప్రవీణ్, సాపిరెడ్డి వెంకటేశ్వరరావు, కంచర్ల బాబులు, గుర్రం ధర్మరాజు, కె.దొరబాబు, నిమ్మకాయల రాంబాబు, అబ్బిరెడ్డి రాముడు తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో అయ్యప్ప కలశపూజ



గొల్లవిల్లిలో కలశపూజ చేస్తున్న అయ్యప్ప మాలాధారులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రు గ్రామంలో అయ్యప్ప స్వాములు కలశపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంచుమర్తి రామారావు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజకు దూర ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలాధారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని గ్రామంలో ఊరేగిస్తూ పేటతుల్లి నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో పరిసరాలు మార్మోగాయి.

లక్ష్మీగణేష్‌కు ఇన్‌స్పైర్ పురస్కారం



లక్ష్మీగణేష్‌ను ఇన్‌స్పైర్ అవార్డుతో సత్కరిస్తున్న సంఘ నాయకులు

అమలాపురం రూరల్: సమనస రామా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ లక్ష్మీగణేష్‌కు ఇన్‌స్పైర్ ప్రిన్సిపాల్ అవార్డు లభించింది. యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా విశాఖపట్నంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ కరెస్పాండెంట్, బెస్ట్ ప్రిన్సిపాల్, బెస్ట్ టీచర్లకు అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా సమనస గ్రామంలోని శ్రీ రామా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఇన్‌స్పైర్ ప్రిన్సిపాల్ అవార్డుతో సత్కరించారు. విద్యతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నందుకు గానూ ఈ పురస్కారం దక్కినట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చల్లపల్లిలో ఓటరు లిస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఉప్పలగుప్తం: పోలింగ్ స్పెషల్ క్యాంపైన్‌డే సందర్భంగా మండలంలోని గోపవరం, చల్లపల్లి పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కె.మాధవి ఆదివారం పరిశీలించారు. రాబోవు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం మార్పులు, చేర్పులు, తొలగింపులను బీఎల్‌వోలు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఎస్.దివాకర్, వీఆర్‌వో పి.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

యానాం: యానాం పట్టణంలో 11కేవీ విద్యుత్ నిర్వహణ, చెట్ల ఆకుల తొలగింపు నేపథ్యంలో సోమవారం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఎం.వీరవెంకట సత్యన్నారాయణ తెలిపారు. గణపతినగర్, రమాబాయినగర్, ఆదిఆంధ్రపేట, వంశీకృష్ణ కాలనీ, మెట్టకూరు, రామన్నకోడు, జీఎస్ నాయుడుకాలనీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వంతెనల నిర్మాణాలకు మోక్షమెన్నడో..!

- ట్రాఫిక్ ఉచ్చులో విలవిల్లాడుతున్న జిల్లా కేంద్రం
- పట్టణంలో కీలక వంతెనలపై స్తంభిస్తున్న ట్రాఫిక్
- ప్రత్యామ్నాయ వంతెనలు నిర్మిస్తేనే పరిష్కారం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.9 కోట్లతో ప్రతిపాదనలు
- టీడీపీ ప్రభుత్వం కొలువుదీరాక తిలోదకాలు



అమలాపురంలో ఈదరపల్లి వంతెన వద్ద ట్రాఫిక్ స్తంభించిన దృశ్యం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ఒకప్పుడు రెవెన్యూ డివిజన్ కేంద్రం. కోనసీమకు ప్రధాన పట్టణం. జిల్లాల పునర్విభజనతో నేడు జిల్లా కేంద్రంగా అవతరించింది. జిల్లా కేంద్ర కార్యాలయాలు, భవనాలు, అధికారులు, ఉద్యోగులు, జిల్లా కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలతో అమలాపురం పట్టణం ప్రస్తుతం ట్రాఫిక్ ఉచ్చులో బిగుసుకుపోతోంది. జిల్లా కేంద్రం కాక ముందే పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య వేధిస్తూ ఉండేది. సాయంత్రం అయిదు గంటలు అయిందంటే చాలు పట్టణం ట్రాఫిక్ పద్మ వ్యూహంలోకి వెళ్లిపోయేది. ఇప్పుడు జిల్లా కేంద్రం అయ్యాక ఈ సమస్య మరింత జటిలంగా మారింది.

మూడు ప్రధాన వంతెనలకు ముప్పు

ఈదరపల్లి వంతెన, నల్ల వంతెన, ఎర్ర వంతెన పట్టణంలో కీలకంగా ఉన్నాయి. దాదాపు 50 ఏళ్ల క్రిందట నిర్మించిన ఈ వంతెనలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పట్టణ ట్రాఫిక్ అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీంతో ఈ వంతెనలపై ట్రాఫిక్ రోజు రోజుకు భారమవుతోంది. ఈదరపల్లి వంతెనపై నుంచి రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చి వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా నల్లవంతెనపై నుంచి కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు అయినవిల్లి మండలం వైపు నుంచి వచ్చి వెళ్లే వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఎర్ర వంతెనపై కాకినాడ వైపు నుంచే కాక ఉప్పలగుప్తం మండలం నుంచి సైతం వాహనాల రాకపోకల తాకిడి అధికంగా ఉంటుంది. ఇలా పట్టణంపై మూడు వంతెనల ద్వారా ట్రాఫిక్ చిక్కులు ముప్పేట దాడి చేస్తున్నాయి. ఈ వంతెనలపై సాయంత్రం నుంచి రాత్రి 7 గంటల వరకూ ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ట్రాఫిక్ చిక్కుముడులు విప్పేందుకు పట్టణ పోలీసులు తెగ హైరానా పడడం కూడా సాధారణమైపోయింది. పట్టణంలో ఆటోలు ఎక్కడిపడితే అక్కడ ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులు సాయంత్రం సమయంలో ఒకేసారి పట్టణ రోడ్లపైకి రావడం వంటి ప్రతికూల పరిస్థితులు ట్రాఫిక్‌ను మరింత జటిలం చేస్తున్నాయి.

దీనికి తోడు ఓఎన్జీసీ భారీ వాహనాలు సైతం ఈ మూడు వంతెనలపై నుంచి వెళ్లడం కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తోంది. రాత్రి 7 గంటలైతే పట్టణ ప్రధాన రోడ్లపై పలు చోట్ల హైదరబాద్‌కు వెళ్లే ప్రైవేటు ట్రావెల్ బస్సులు నిలపడం కూడా ట్రాఫిక్ తీవ్రతకు కారణమవుతున్నాయి. మూడు వంతెనల వద్ద ట్రాఫిక్ స్తంభించినప్పుడు అందులో చిక్కుకున్న వాహనదారులు నరకాన్ని చూస్తున్నారు.

అటకెక్కిన ప్రతిపాదనలు

పట్టణంలో కీలకంగా మారిన ఈ మూడు వంతెనలకు ప్రత్యామ్నాయ వంతెనల నిర్మాణాలకు రూ.15 కోట్ల వరకు వ్యయమవుతోందని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు. గత ప్రభుత్వంలో మంత్రి పినిపే విశ్వరూప్ కూడా ఈ వంతెనల నిర్మాణాలకు రూ.9 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయడమే కాక నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి. అమలాపురం పట్టణ మాస్టర్ ప్లాన్ అమలుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఇటీవల ఆమోద ముద్ర వేసింది. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్ల వ్యయం అవుతుందని ఎమ్మెల్యే ఆనందరావు ప్రకటించారు. పట్టణానికి మాస్టర్ ప్లాన్ అమలు కంటే ముందు మూడు వంతెనలకు ప్రత్యామ్నాయ వంతెనలు నిర్మించి పుణ్యం కట్టుకోండని పట్టణ ప్రజలే కాక జిల్లా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణానికి పెను అవరోధంగా మారిన ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం మూడు వంతెనలకు ప్రత్యామ్నాయ వంతెనల నిర్మాణం జరిగినప్పుడే లభిస్తుందన్నది వాస్తవం. పట్టణంలో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఇప్పటికే ఉన్న ఈదరపల్లి బైపాస్ రోడ్డు చాలా వరకు అక్కరకు వస్తోంది. ఈదరపల్లి వంతెన నుంచి భట్లపాలెం మీదుగా మరో బైపాస్ రోడ్డు నిర్మాణం యోచన 25 ఏళ్ల కిందటే పాలకుల మదిలో మెలిగింది. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన సైతం జరిగి అటకెక్కించింది. ఇప్పుడు భట్లపాలెం, ఇందుపల్లి, ఈదరపల్లి రోడ్లు జాతీయ రహదారిలో అనుసంధానం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమైన పరిణామం పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కొంత కలసి వచ్చే అంశమే.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసు సిబ్బంది ఎక్కువ సయయం కేటాయిస్తున్నారు. ప్రత్యేకంగా ట్రాఫిక్ ఎస్సైతో పాటు హోంగార్డులు సైతం నిత్యం ట్రాఫిక్ విధుల్లోనే ఉంటున్నారు. ఆటోలు, ఇతర వాహనాల యూనియన్లతో తరుచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం. విద్యా సంస్థల బస్సుల క్రమబద్ధీకరణపై కూడా ఆయా సంస్థల యాజమాన్యాలతో చర్చిస్తున్నాం. పోలీసుల ప్రయత్నాలకు తోడు వాహన చోదకుల సహకారం కూడా అవసరం. పట్టణంలో ఎక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైతే పరిష్కారానికి పోలీసు సిబ్బంది సత్వరం స్పందిస్తున్నారు.

– పి.వీరబాబు, పట్టణ సీఐ, అమలాపురం.

సూర్య బలిజ సంఘీయుల కార్తిక వనసమారాధన

హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు



సంఘ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సంఘీయులు



వనసమారాధనకు కరపత్రాలతో ఆహ్వానిస్తున్న చెల్లుబోయిన శ్రీను

అమలాపురం టౌన్: పట్టణ సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. పట్టణంలోని సూర్య బలిజ కుటుంబీకులంతా ఈ వేడుకలో పాల్గొని సందడి చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు భాస్కర్ల రామకృష్ణ మాట్లాడుతూ తమ సంఘానికి సొంత భవనం నిర్మాణానికి పట్టణంలో ఎక్కడైనా రెండు లేదా మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై ఎమ్మెల్యే ఆనందరావు సానుకూలంగా స్పందించారు. అనంతరం సంఘ సీనియర్ నాయకుడు, పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ కాశే వెంకటేశ్వరరావును సంఘీయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాశే ఆదిపట్టాభిరామయ్య (చంటి), కాశే దుర్గా ప్రసాద్, యండమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. సంఘీయులంతా కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. సూర్య బలిజ కుటుంబీకులంతా ఆట పాటలతో సరదాగా గడిపారు. పిల్లలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు.

కార్తిక వనసమారాధనకు తరలిరండి

అల్లవరం: అమలాపురం సూర్యనగర్ శివారు వాసర్ల గార్డెన్‌లో ఈ నెల 17న జరగనున్న శెట్టిబలిజ కార్తిక వన సమారాధనకు వేలాదిగా సంఘీయులు తరలి రావాలని కోనసీమ శెట్టిబలిజ ఆహ్వాన సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ నాయకులు చెల్లుబోయిన శ్రీను అల్లవరం మండలంలోని దేవగుప్తం, అల్లవరం, తూర్పులంక, కొమరగిరిపట్నం, గోడి, ఎంట్రుకోన, కోడూరుపాడు, గూడాల తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించి కార్తిక వనసమారాధనకు హాజరు కావాల్సిందిగా శెట్టిబలిజ సంఘీయులకు కరపత్రాలను అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, శెట్టిబలిజ నాయకులు గొవ్వాల రాజేష్, పాటి శ్రీరామ్, పితాని శేఖర్, అప్పారి చంద్రశేఖర్, గోవిందు, అధిక సంఖ్యలో శెట్టిబలిజ సంఘీయులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు ఐక్యతతో హక్కులు సాధించాలి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: జిల్లాలోని బీసీ ఉద్యోగులు ఐక్యతతో తమ హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొంకాపల్లి శివారు సత్తెమ్మతల్లి గుడి వద్ద ఆదివారం జరిగిన కార్తిక వనసమారాధనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన బీసీ ఉద్యోగులు పాల్గొని సందడి చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, బీసీ నాయకురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, రాష్ట్ర సంఘం సంయుక్త కార్యదర్శి బొంతు వీవీఎస్ఎన్ మూర్తి తదితరులు మాట్లాడారు. బీసీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో వనసమారాధనకు హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. ఈ వేడుకకు అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే ఆనందరావు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం తదితరులను జిల్లా సంఘం తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీర వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి పావులూరి వెంకటేష్ గోపాలం, ఉపాధ్యక్షుడు సరిదే సత్య పల్లంరాజు. మహిళా విభాగం గౌరవ అధ్యక్షురాలు ఎస్.రాజరాజేశ్వరి, అధ్యక్షురాలు రెడ్డిశిరీష పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదృశ్యం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి రాజుపాలెంలో ఒక ఇంటి వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితుడు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజుపాలెంకు చెందిన కొప్పిశెట్టి సురేష్ తన మోటారు సైకిల్ సుజుకి యాక్సిస్‌ను ఇంటి బయట పెట్టాడు. మరునాడు ఉదయం చూసేసరికి అక్కడ బండి అదృశ్యమవడంతో తన వాహనం చోరీ అయినట్లు గుర్తించాడు. వాహనంలో తను రోజూ ఉపయోగించే క్యాబ్ కూడా ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్సై డి. జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేఎంఎల్ఆర్‌టీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ మెడికల్ లేబొరేటరీ, రెడియాలిజికల్ టెక్నాలజిస్ట్ (కేఎంఎల్ఆర్‌టీ) అసోసియేషన్ సమావేశం స్థానిక ముస్లిం షాదీఖానా భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్తిక వనసమారాధన వేడుకలను నిర్వహించటంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ వేడుకల్లో చెన్నైలోని డాక్టర్ బోరస్ ఆంద్రో ల్యాబ్, రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ బోరస్ పురుషోత్తమన్ కంప్యూటర్ అసిస్టెంట్ సిమెన్ ఎనాలిసిస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. అనంతరం కోనసీమ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా తిక్కిరెడ్డి ప్రసాద్, అధ్యక్షుడిగా ముత్తాబత్తుల ప్రమోద్‌కుమార్, కార్యదర్శిగా కాండ్రేగుల సోమేష్, కోశాధికారిగా గుబ్బల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సునీల్ శాస్త్రి, ఉప కోశాధికారిగా మోసుగంటి శ్రీకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ల్యాబ్ టెక్నీషియన్లు, రెడియాలిజిస్టులు హాజరయ్యారు.

కవి బాలార్జునకు సత్కారం



కవి సమ్మేళనంలో బాలార్జునను సత్కరిస్తున్న నన్నయ విశ్వ విద్యాలయం వీసీ శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన తెలుగు జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అమలాపురానికి చెందిన కవి బాలార్జున సత్యనారాయణ మాకేకు ఘన సత్కారం జరిగింది. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేస్తున్న బాలార్జున అందిస్తున్న సాహితీ సేవలకు గాను ఆయనకు ఈ సత్కారం లభించింది. భాషా వికాసానికి ఇతోధికంగా కృషి చేస్తూ జాతీయ సాహితీ, కవి సమ్మేళనాల్లో కవితా గానాలు వినిపించటం ద్వారా 146 ప్రశంసా పత్రాలు అందుకున్నారని శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కొనియాడారు. నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్, డీన్ ఆచార్య కేఎస్ రమేష్ తదితరులు బాలార్జున కవితా ప్రతిభను అభినందించారు.

చిక్కం సోదరులకు అరుదైన గౌరవం



డాక్టరేట్, ఎక్స్‌లెన్స్ రికార్డు అందుకున్న చిక్కం సోదరులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన ఎస్ఎస్ఆర్, ఎల్‌టీఎల్ ట్రైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చిక్కం సాంబశివరావు, సీఎఫ్‌వో చిక్కం శాంతి స్వరూప్ సోదరులకు అరుదైన గౌరవం లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ పీస్ కాన్ఫరెన్స్‌లో సాంబశివరావుకు డాక్టరేట్ ప్రదానం చేయగా శాంతి స్వరూప్‌కు ఎక్స్‌లెన్స్ రికార్డు అందించారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న శాంతి స్వరూప్‌కు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఎక్స్‌లెన్స్ రికార్డులకు ఎంపిక చేసింది. అందులో భాగంగానే సాంబశివరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శాంతి స్వరూప్‌కు ఎక్స్‌లెన్స్ రికార్డును అందించింది.

జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

- పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడలు



బాస్కెట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

యానాం: రాష్ట్రస్థాయిలో నైపుణ్యాలను సాధించిన క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయస్థాయిలో రాణించేలా నిరంతర సాధన చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన 'పుదుచ్చేరి స్టేట్ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్- 2024-25' పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా శిక్షణకు యానాం సాయ్ అకాడమీని సైతం వినియోగించుకోవాలని అన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలు వీరే

పుదుచ్చేరి రాష్ట్రస్థాయి క్రీడల్లో భాగంగా ఖోఖో అండర్-17లో జోన్-2 ప్రథమ, జోన్-4 ద్వితీయ, జోన్-3 తృతీయ బహుమతులు సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్ అండర్-17లో జోన్-8(యానాం)ప్రథమ, జోన్-4(పుదుచ్చేరి) ద్వితీయ, జోన్-1 తృతీయ స్థానాలను పొందాయి. బాస్కెట్‌బాల్‌లో జోన్-2 ప్రథమ, జోన్-8 ద్వితీయ, జోన్-1 తృతీయ స్థానాల్లో నిలువగా షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 బాలికల విభాగంలో జోన్-1 ప్రథమ, జోన్-4 ద్వితీయ, జోన్-2 తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో జోన్-1 ప్రథమ, జోన్-2 ద్వితీయ, జోన్-4 తృతీయ, అండర్-17 బాలికల విభాగంలో జోన్-4 ప్రథమ, జోన్-2 ద్వితీయ, జోన్-4 తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-19లో జోన్-2 ప్రథమ, జోన్-5 ద్వితీయ, జోన్-1 తృతీయ, అండర్-19 బాలికల విభాగంలో జోన్-6 ప్రథమ, జోన్-1 ద్వితీయ, జోన్-7 తృతీయ స్థానాలను సాధించారు. విజేతలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, స్పోర్ట్స్ డీడీ వైద్యనాథన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినకోటి సన్యాసిరావు, స్టేడియం ఇన్‌చార్జి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లాడి ప్రకటన అప్రజాస్వామికం'

- అభివృద్ధి పనులకు తానే భూమిపూజలు చేస్తానని ప్రకటించడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే అశోక్ మండిపాటు

యానాం: నియోజకవర్గ పరిధిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్) నిధులతో చేపట్టే పనులకు ఈ నెల 14న తాను భూమి పూజలు చేస్తున్నట్లు ఆదివారం మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రకటించడంతో యానాంలో రాజకీయ పరిణామాలు వేడెక్కాయి. దీనిపై ఎమ్మెల్యే అశోక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగ బద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడ్డ శాసనసభ్యుడు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తానే భూమి పూజలు చేస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రకటించడం అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. మల్లాడి తన నామినేటెడ్ పదవిని అడ్డం పెట్టుకొని మొత్తం అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచిన తనకు ప్రజల పూర్తి మద్దతు ఉందని తనకు వస్తున్న ఆదరణ చూసి మల్లాడి భయపడుతున్నారని విమర్శించారు. సీఎస్సార్ నిధుల మంజూరుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలే బోర్డు మెంబర్లుగా వ్యవహరిస్తారని తనను కాదని ఈవిధంగా వ్యవహరించడంపై ఎల్జీ కైలాషనాథన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

తాళ్లరేవు: పీఎంపీలు సేవా భావంతో పనిచేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ అరుణ హాస్పిటల్ వైద్యులు చవ్వాకుల శేషగిరిరావు, హిమబిందు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో వైద్యవిజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పాడి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తాళ్లరేవు, యానాం తదితర ప్రాంతాలకు చెందిన పీఎంపీ వైద్యులు హాజరయ్యారు. వైద్యులు శేషగిరిరావు, హిమబిందు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రాణాంతక వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెహమాన్ షరీఫ్, కొప్పాడి కృష్ణకిషోర్, మోహన్, అత్తిలి శ్రీను, గుత్తుల రమణ, ఆర్.సూర్యనారాయణ, ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష



అయ్యప్ప భక్తులను సత్కరిస్తున్న గురుస్వామి జగ్గప్పరాజు

ముమ్మిడివరం: అయ్యప్ప ఆలయం వద్ద శనివారం రాత్రి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ, భజన కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన స్వాములు ఆలయ అర్చకులు పవన్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పేటతుల్లి, పడిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 18వ సారి శబరిమలై మాలాధారణ చేసిన ఐదుగురు స్వాములను జగ్గప్పరాజు గురుస్వామి చేతుల మీదుగా సేవాసమితి సభ్యులు సత్కరించారు. ఎస్ఆర్‌కే కృష్ణంరాజు ఆధ్వర్యంలో భజన బృందం సభ్యులు ఆలపించిన గీతాలు అలరించాయి.

శెట్టిబలిజ కార్తిక వనసమారాధన



మంత్రి సుభాష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సంఘీయులు

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం సందర్భంగా ఆదివారం జార్జిపేటలోని శ్రీరామ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శెట్టిబలిజలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వారి ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 24న అమలాపురంలో నిర్వహించే శెట్టిబలిజ కార్తిక వనభోజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చిన్నారులకు మంత్రి బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ముమ్మిడివరం: ముమ్మిడివరం తారా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో తారా కుమారి వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్సై డి.జ్వాలాసాగర్, కళాశాల వ్యవస్థాపకులు జి.సత్యనారాయణలు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ జీవీకే సుమంత్, ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు, వై.వెంకటలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి గోకులానికి పశుగ్రాసం వితరణ

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వరస్వామి గోకులానికి నియోజకవర్గ పరిధిలోని గాడిలంక గ్రామానికి చెందిన కాకర్లపూడి రవివర్మ రూ.15 వేలు విలువ చేసే పశుగ్రాసం(ఎండుగడ్డి) వితరణ చేశారు. వీరేశ్వరస్వామి దేవస్థానం సుమారు పది గోవులను పోషిస్తోంది. దాతను ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరాజు సత్కరించారు.